# మనసులో మాట.....

మనసున్న మనిషికి సుఖం వుండదని ఆత్రేయగారు అననే అన్నారు. అంటే ఆయన అన్నారని అనటం కాదుగాని మనసుంటే కాస్త ఇబ్బందే సుమా ! అందుకనే చాలా మంది దాన్ని చంపేసి చేతులు దులుపుకుని కుషి కుషీగా నవ్వేస్తూ బతికేస్తారు. మనసుంటే మార్గం వుంటుందంటారు. మార్గం సంగతి ఎలా వున్నా మాటలు నేర్చిన మనసుతో మహా ఇబ్బంది. చదువుకున్న భార్య, చదువులేని భార్యల్లాగా మనసుల్లోకూడా పలుకు నేర్చిన మనసు, పలకలేని మనసు అంటూ రెండు రకాలుంటాయి. పలకని మనసయితే పేచీ వుండదు. మనమాటే దాని మాటన్నూ. తేడా రాదు. వాడిని మోసం చేద్దాం అంటే, ఏమిటి ఆలస్యం అంటూ తొందరపడుతుంది. ఆ కొంపకి ఎసరు పెట్టాలని ఆలోచిస్తున్నాని సూచనప్రాయంగా అంటే ' లేవయ్యా లేవయ్యా లేరయ్యా నీ సాటి ' అంటూ సంగీత రూపకంతో ఉత్సాహ పరుస్తుంది. ఇలాంటి మనసులతో ఇబ్బంది వుండదు. కానీ అందరి మనసులూ అలా వుండవు. ప్రతి చిన్న విషయానికి లా పాయింట్లు లాగి మీటింగులు పెడతాయి. ప్రపపంచం మొత్తాన్ని జయించి, సమాధాన పరచినా , ఇలాంటి మొండి మనసులతో వేగటం కష్టం, నిద్రపోనివ్వ . తిన్నది హారాయించుకోనియ్యవు. సంపాయించినదాన్ని అనుభవించనీయవు. మనమాట అది వినవు . దాని మాట మనం మరెవరికీ చెప్పుకోలేం. చెప్పేస్తే మనమెంత వరస్టుఫెలోనో ప్రపంచానికి ఇట్టే అర్ధమైపోతుంది.

మనం గూడా కొన్ని మాటల్ని విషయాల్ని మనసులో పెట్టుకుంటాం. ఎవరికీ చెప్పుకోం. ఇలా మనం మాటల్ని రహస్యాన్ని మింగేస్తుంటే వాటి బరువు మొయ్యలేక మనసు బరువెక్కుతుంది. ఈ మధ్యన ఒకాయనకి హార్టుకి పెద్దాపరేషన్ చేయటానికని ఆపరేషన్ గదిలోకి తీసుకువెడుతుంటే , ఆయన భార్య ఆదరగాబాదరాగా వచ్చి డాక్టరుగారితో రహస్యంగా, ' ఎలాగూ తెగ్గొస్తారు కాబట్టి కాస్త ఆయన మనసులో ఏముందో చూసి చెప్పమని ప్రాధేయపడిందిట. దాన్ని బట్టి ఆ భర్తగారి గుండె జబ్బు ఎందుకొచ్చిందో అంచనా వెయ్యొచ్చు. చదువకునే రోజుల్లో ఏ డాక్టరుగారి అమ్మాయినో చూసి మనసు పడతాం. కాని ఆ పిల్ల మనల్ని చూస్తే చాలు మండి పడుతుంది. కథ అక్కడితో ఆగి పోవచ్చుగాక. కాని మనసు ఆ పిల్లని మర్చిపోదు. మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తూ వుంటుంది. శాంతిని సుఖాన్ని దూరం చేస్తుంది. తొలినాటి ప్రేమకథలు భార్యలకి

తెలిస్తే కొంపలంటుకుపోతాయి. అంచేత ' జరభద్రం కొడుకో ' లాగా జాగ్రత్తగా మేనేజ్ చెయ్యాలి. ఈ మనసుల్లో పేరుకుపోయే మాటల్ని ఎప్పటికప్పుడు ఎవరికో ఒకరికి చెప్పేసుకుంటూ వుండాలట. అలా అయితే మనసు తేలికబడి, ఆరోగ్యంగా వుంటుంది. ఈ థియరీని బాగా గౌరవించే ఒక పెద్ద మనిషి బరువుని వదిలించుకోడానికి సరికొత్త మార్గం కనుక్కున్నాట్ట. ఏవిటంటే తన మనసులో మాటని తాపీగా తీరుబడిగా కూర్చుని విపులంగా కాగితంపైన నీటుగా రాస్తాట్ట. దాన్ని బాగా చిన్న మడతలుగా చేసి బయటికెళ్ళి బస్సెక్కి ఆ కాగితాన్ని మెల్లిగా అక్కడ వొదిలేసి బస్సు దిగి చక్క వస్తాట్ట. దీనివల్ల మీకేమిటి రిలీఫంటే – నవ్వి, నా మనసులో మాటని కాగితంపైన పెట్టాను. కాగితాన్ని ప్రజల మధ్యన వుంచాను. ఒకరు కాకపోతే ఇంకొకరయినా దాన్ని చదువుతారు. కాబట్టి ఇంకో మనిషికి నా మనసులో మాటని కమ్యూనికేట్ చేసినట్టుగానే ఫీలయి, హాయిగా నిద్రపోతానన్నాడు. ఈ మనసునిలా వుంచటంలో ఇన్ని కష్టాలున్నాయి. ఈ మధ్యన నాకో లోకల్ ఉత్తరం వచ్చింది. దానిలో నేనొక నగర వాసిని , డిగ్రీ చదివాను. మా స్వగ్రామం ఫలానా అంటూ ఎత్తుకుని ఉత్తరం రచయిత ఎన్ని మోసాలు , నేరాలు , అసత్యాలు, దుర్మార్గాలు చేసేడో విపులంగా పదికేజీల ఉత్తరం రాసి సంతకం మాత్రం లేకుండా జాగ్రత్తపడి. పనికొస్తే ఇదంతా ఒక నవలగా రాసుకోమని పర్మిషన్ కూడా ఇచ్చేరు. బస్సుల్లో , కాగితాలొదిలే బాబే ఇది గూడా రచించాడేమోనని డౌటు. వార్ని అడగలేదు. మనసులో పెట్టుకున్నా !

అదేదో దేశంలో , మనసులో మటల్ని తెరికెక్కిస్తున్నారట. ఏ విధంగానంటే, మనల్ని కంప్యూటరు ముందు కూచోబెట్టి బటన్స్ బర బరా నొక్కేస్తే, మన మనసులో మాటలు తాటికయంత అక్షరాలలో తెరమీద దర్శనం ఇస్తాయట. అలాంటివి మనకి మన దేశానికి ఎంత దూరంగా వుంటే అంత శుభప్రదం. ఇంటింటా ఈ కంప్యూటర్లు గాని తెప్పిస్తే , మొగుడు ఆఫసునించి రాగానే భార్య బటన్ నొక్కిందంటే మగవాడి పని అంతే సంగతులు. ఆడవాళ్ళ మనసులో మాటలు దాగవంటారు కాని, వాళ్ళకీ గొడవలుంటాయి. కాకపోతే ఆడ మనసులు రాజీపడతాయి. మగ మనసులు పడవ్ అంతే తేడా ! నా మనసులో రెండు మాటలూ మీకు చెప్పాక ఎంత హాయిగా వుందని ! చెప్పలేను.

------- అయ్యిపోయింది -------